## ట్రాన్స్ఫర్

ఎట్లాగయితేనేం అప్పారావు(గారు) కలెక్టర్ అయ్యాడు. అతని తెలివి వల్ల అని అప్పారావు చెబుతూ వుంటాడు. కాని మంచంలో వున్న తాతయ్య మాత్రం అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు బజార్లో (వాళ్ళ వాకిటి ముందు నుంచి) వెళ్ళే వాళ్ళకు మాత్రం "అంతా తిరుపతి వెంకటేశ్వర స్వామి దయ" అంటూ వుంటాడు. ఒక్క అనడమే కాదు ఇంట్లో నువవడితో తగాదా కూడా పెట్టుకున్నాడు- "నీవు తిరుపతి వెళ్ళాలి. తలనీలాలు యివ్వాలి" అని.

అప్పారావేమో ఇప్పుడు కాదు - గుండు తీయించుకొని మొదటిసారిగా ఆఫీసుకెళితే "అదిగో అతనేరా.. ఆ గుండు కనిపించడంలా.. ఆయనే మా కొత్త కలెక్టర్" అంటారనే బాధతో బాధపడాలని ఈ సంగతి గురించి ఒకే మంచంలో పడుకొని, ఒకే కంచంలో తినే స్నేహితుడుతో సంప్రదిస్తే ఒక చిలక నవ్వేసి "దీని కోసం యింత బాధపడాలా" అనే ముఖం పెట్టి చెవిలో రహస్యం వూదేశాడు. ఇంకేముంది అప్పారావు ముఖం ఏనుగు చెవి అంతయింది. ఎగిరి గంతేశాడు. వెంటనే ఆర్.డి.ఓ. గారికి తిరుపతి వెళ్ళిగుండు చేయించుకోమని ట్రాన్స్ఫర్ చేశాడు. వెంటనే ఆర్. డి.ఓ.గారు "కలెక్టర్‌గారు ట్రాన్స్ఫర్ చేయుగా లేంది నేను చేస్తే ఏమయిందని" తహసిల్దారుకు బదిలీ చేశారు. ఇలా తహసిల్దారుగారు తన డిప్యూటీ గారికి, డిప్యూటీగారు ఆర్.ఐ. గారికి, ఆర్.ఐ. గారు యు.డి.సి. గారికి, సరేమో యు.డి.సి. గారు ఎల్.డి.సి. గారికి, ఎల్.డి.సి. గారు బంట్రోతు గారికి ట్రాన్స్ఫర్స్ వెంటవెంటనే చేయడం జరిగింది.

బిళ్ళ బంట్రోతు క్రింద ఎవ్వరూ లేనందున తిరుపతి వెళ్ళడానికి బంట్రోతుకు తప్ప లేదు. సదరు బంట్రోతుగారు టి.ఎ., డి.ఎ. లు స్వీకరించి ఒక శుభముహూర్తాన శనివారం తిరుపతి చేరేటట్టు రిజర్వేషన్ చేయించుకొని తన వుంగరాల జుట్టును మాటిమాటికి అద్దంలో చూసుకుంటూ దిగులుగా తిరుపతి వెళ్ళాడు.

నేరుగా కళ్యాణకట్టకు వెళ్ళి వెంకటేశ్వరస్వామికి ఒక నమస్కారం పెట్టి కలెక్టర్‌గారి నుంచి తన దాకా వచ్చిన ట్రాన్స్ఫర్స్ యేకరవు పెట్టి ఏమీ అనుకోవద్దంటూ బంట్రోతు కూడా చేయించుకునేవానికి ట్రాన్స్ఫర్ చేస్తూ హాయిగా వూపిరి పీల్చుకొని తన వుంగరాల జుట్టును చేత్తో సరిచేసుకొని ఆనందంతో వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని ఇంటికి చేరుకుని జరిగింది కలెక్టర్‌గారి దాకా చెప్పినవానికి చెప్పకుండా చెప్పకుంటూ పోయాడు.

కలెక్టర్‌గారు ఈ సంగతి ఎక్కడ పేపర్లో పడుతుందోనని ఆదరాబాదరా తిరుపతి వెళ్ళి గుండు కలెక్టర్‌గా పేరుగాంచాడు.

— చక్రవర్తుల అంబికా సోని

కథ

# కోరిక

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)
ఉగాది మినీ కథల పోటీలో
సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

"ఇదిగో! మీ నాన్న పండగకు రమ్మనమని ఉత్తరం వ్రాశారు" ఆఫీసునుంచి వస్తూనే ఉత్తరం ఇచ్చాడు శంకరం.

మంచినీళ్ళ గ్లాస్ అక్కడే పెట్టి, ఆత్రంగా ఉత్తరం చదివింది రాధ.

'పండక్కి అక్క, బావగార్లని కూడా పిలిచాం, మీరు కూడా తప్పక రండి. సెలవు పెట్టి రెండు రోజులు ముందుగానే పిల్లల్ని తీసుకుని రండి' అని దాని సారాంశం.

"ఎప్పుడు వెళదాం?" అంది రాధ సంతోషంగా.

ఒక్క క్షణం భార్య ముఖంలోకి చూసి "చూద్దాం! తొందరేమిటి?" అన్నాడు శంకరం.

వంట చేస్తున్నదన్నమాటే గాని మనసంతా పుట్టింటి మీద, రాబోయే పండగ మీదే వుంది.

ఈసారి నుంచి అక్కలాగా తనకు కూడా పండగకు డబ్బులే ఇమ్మనమని అడగాలి నాన్నని.
ప్రతిసారి ఇంటికి వస్తున్నప్పుడల్లా తను కొను క్కున్న చీరలన్నీ తెస్తుంది లలిత. 'ఈ చీర మాకు ఎరియర్స్ రాగానే కొనుక్కున్నానే రాధా! ఇదుగో ఇది శ్రావణ శుక్రవారం నాటికి కొనుక్కున్నానే... ఈ చీర ఎలా వుంది? మా కొలీగ్‌తో షాపింగ్‌కు వెళితే బావుందనిపించి తీసుకున్నా. ఇది మూడు, పండగకి అని తీసుకున్నా.... నాన్న ఉత్తరంలో వ్రాశారు- మేము వంద రూపాయలు చీర కిద్దామనుకుంటున్నాం. నువ్వు అంత చవక చీరలు కట్టవు కనుక, పై డబ్బులు నువ్వు వేసుకుని చీర కొనుక్కుని తెచ్చుకో- అని. పైన రెండు వందలు వేసి మూడొందలు పెట్టి ఈ చీర తీసుకున్నానే.'

'ఇలా చెబుతూ వుంటుంది వచ్చినప్పుడల్లా. తనకి ఎంత సిగ్గుగా వుంటుందో. తను ఇప్పటివరకు స్వంతగా ఒక్క చీర కొనుక్కోగలిగిందా! ఎప్పుడూ ఆయన తీసుకురావడమే. 'నేనూ వస్తాను' అంటే 'నువ్వేం కట్టుకుంటే బావుంటావో నీకన్నా నాకే తెలుసులే' అంటారు. ఆయన సెలక్షను బావుంటుందని అందరూ మెచ్చుకుంటారు. కాని తనకే అక్కలాగా స్వంతగా సెలెక్ట్ చేసుకోలేదు కదా అని బాధ. పోనీ అమ్మావాళ్ళయినా డబ్బు ఇచ్చి



కొనుక్కోమనరు. 'అక్క ఉద్యోగస్తురాలు కదమ్మా, మా చీరలు నచ్చుతాయో, నచ్చవో అని దానినే తెచ్చుకోమంటాం. నేను కొని నీకు ఒళ్ళో పెడితే గాని నాకు తృప్తి వుండదు' అంటుంది అమ్మ.

'ఈయన ఎలాగూ నా మాట వినరు. ఈసారి నుంచి ఏమైనాసరే అమ్మని డబ్బులడిగి తీసుకుని నేనే చీర కొనుక్కుంటాను' నిర్ణయించుకుంది రాధ.

*   *   *   *   *

"ఎక్కడినుంచి లెటర్?" అడిగాడు మోహన్.

"నాన్న దగ్గర్నుంచి" అని మోహన్ కిచ్చింది లలిత.

"మీ వాళ్ళకి పిచ్చా! పెళ్ళి అయి ఏడేళ్ళయింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఇంకా కొత్త అల్లుడిలాగా పండక్కి రమ్మనమని ఈ ఆహ్వానం ఏమిటి?"

"ఈ ఒక్క పండక్కే కదా, వాళ్ళు పిలిచినా, మనం వెళ్ళినా. మనకు, పిల్లలకు వారం సెలవు లుంటాయి కదా! వెళ్ళి వద్దాం. నాకూ బోర్‌గా వుంది" అంది గారంగా.

"ఊ! తప్పేదేముంది. ఏమిటో చీరా? అదీ తెచ్చుకోమని వ్రాశారుగా. రేపు తెచ్చుకో. బయల్దేరుదాం" అని బయటికి వెళ్ళాడు మోహన్.

'ఈసారి నుంచి ఈ పద్ధతికి స్వస్తి చెప్పాలి' అనుకుంది లలిత. 'ఎప్పుడూ నేను కొనుక్కోవడమేనా చీరలు! ఈయనకు ఈయన - పెళ్ళయిన దగ్గర్నుంచి ఒక్క చీర కొనలేదు. పిల్లలకు, నాకు కూడా నేనే తెచ్చుకోవాలి. తోడు కూడా రారు. 'నాకేం తెలుసు, నువ్వూ సంపాదిస్తున్నావు. నీకు కావలసింది నువ్వు తెచ్చుకో. పైగా నీకేం చీర బావుంటుందో నాకేం తెలుసు' అంటారు.

'అక్కా! ఇది నా పుట్టిన రోజుకి మీ మరిది తెచ్చిపెట్టారు. ఇదేమో మా వెడ్డింగ్ యానివర్సరీకి తీసుకొచ్చారు' అంటూ సిగ్గుపడుతూ, మురిపెంగా చెపుతుంది. ఈయనకు అవేమీ గుర్తువుండవు.

'ఇది మా వారు నా కోసం కొన్న చీర' అని చెప్పుకోవడానికి ఒక్క చీర కూడా లేదు కదా! ప్చ్!

'అమ్మా వాళ్ళు కూడా నన్ను సరిగ్గా అర్థం చేసుకోవడం లేదు. చవక రకం చీరైనా వాళ్ళు పెట్టింది వేరు. నేను కొనుక్కోవడం వేరు. ఆ చీర చూస్తే అమ్మావాళ్ళు పెట్టిన చీర అని గుర్తే రాదు. అది నా సెలక్షనుగా నాకు తెలుస్తూనే వుంటుంది. 'మా అమ్మ పండక్కి పిలిచి నాకు పెట్టిన చీర' అనే భావనతో నా మనస్సు స్పందించాలి. ఈ పద్ధతిలో నాకు తృప్తి కనిపించడం లేదు. మన ప్రేమను సున్నితమైన భావనతో వ్యక్తపరచటానికే ఈ పెట్టుపోతలు అనుకుంటాను. కేవలం డబ్బుతో లెక్క చూసుకుంటే ఎలా? ఈసారినుంచి నేను అమ్మతోనే కొనిపించుకుంటాను. నా కోరిక అమ్మకి తెలియజేస్తాను' అనుకుంది లలిత. ●



నందివాడ సుబ్బలక్ష్మి

## తస్మాత్ జాగ్రత్త

సుబ్బారావు మాష్టారు ఆదరాబాదరాగా బస్‌స్టాండ్‌కు పరుగెత్తుకొచ్చేరు.

ఆయన అర్జంటుగా గుంటూరు వెళ్ళాలి. నాన్‌స్టాప్ బస్ రెడీగా వుంది. 'హమ్మయ్య' అనుకున్నాడాయన. కాని ఏం లాభం. ఇప్పుడు బస్సులో ఇవ్వడం లేదు టిక్కెట్లు. వేరే కౌంటర్ పెట్టేరు.

కౌంటరు దగ్గర చూసేరు. కొండవీటి చేంతాడంత వుంది క్యూ. లైన్లో నుంచుంటే లాభం లేదనుకుని-

"ప్లీజ్... అర్జంటుగా గుంటూరు వెళ్లాలి. ఏమీ అనుకోకండి ఒక్క టిక్కెట్టు తీసిపెట్టండి" అని లైన్లో కొంచెం ముందుగా నుంచున్న ఒకతనికి ఐదు రూపాయిల కాగితం ఇవ్వబోయేడు.

"సారీ సార్... ఇప్పటికే నా దగ్గర ముగ్గురుకి సరిపడా వున్నాయ్... మరెవ్వరికేనా ఇవ్వండి" అన్నాడు ఆ వ్యక్తి.

"నాటితోపాటు ఇదొకటి ఫర్వాలేదు... ప్లీజ్ తియ్యండి" అని ఐదు రూపాయిల కాయితం అతని చేతులో కుక్కారు మాష్టారు బలవంతంగా.

"సరే మీరెళ్లి బస్సులో కూర్చోండి. పక్కన రుమాలు వేసి వుంచండి నాకు. రెండు నిమిషాల్లో టిక్కెట్లు తీసుకొని వచ్చేస్తాను" అన్నాడా వ్యక్తి ఐదు కాగితం తీసుకుని.

"ఓకే" అని మాష్టారు బస్సెక్కి కుడివేపున మూడు సీట్లలో రెండు సీట్లు ఖాళీగా వుంటే ఓ సీటు తను కూర్చుని రెండో సీట్లో చేతి రుమాలు పరిచి వుంచేరు.

అప్పటికే దాదాపు బస్సు నిండిపోయింది.

మరో రెండు నిమిషాల్లో డ్రైవరు వచ్చి టిక్కెట్లు లెక్క చూసుకుంటున్నాడు.

'అయ్యా బస్సులో టిక్కెట్లు లేని వాళ్లుంటే దిగిపోండి' అని హెచ్చరిక చేసేడు.

మాష్టారు అతని కోసం ఎదురు చూస్తున్నారు.

అతనెంతకీ రావడం లేదు.

"ఒక్క నిమిషం వుండనయ్యా... ఒకతనికి డబ్బులిచ్చే నా టికెట్టు తెమ్మనమని... వచ్చేస్తాడు" అన్నాడాయన డ్రైవర్‌తో.

"లేదుసార్ టైం అయిపోయింది. బుకింగ్ కూడా క్లోజ్ అయిపోయింది. కౌంటరు దగ్గర ఎవ్వరూ లేరు. మీరు దిగండి" అన్నాడు డ్రైవరు.

మాష్టారుకి మతి పోయింది. రుమాలు తీసుకుని డోర్ దగ్గరకొచ్చి క్రిందకి అటూ ఇటూ చూసేరు. ఆ వ్యక్తి ఎక్కడా కనిపించడం లేదు. చేసేది లేక బస్సు దిగి పోయేడాయన.

"ఎవడో మస్కా కొట్టేడు పాపం!" అంటున్నాడొకాయన బస్సులోంచి. బస్సు బయల్దేరింది.

వెళ్లి లైన్లో నిలబడ్డారు టికెట్టు కోసం.

"సార్ సార్... ఏమీ అనుకోకండి గుంటూరుకి ఒక్క టిక్కెట్టు తీసిపెట్టండి" అంటూ ఒకాయన వచ్చి మూడు డబ్బై ఐదు చిల్లర ఇవ్వబోయేడు మాష్టారుకి.

"వద్దుసార్... నే ఇపుడే దెబ్బతిన్నాను. ఒకతనికే టికెట్టు తియ్యమని ఐదు రూపాయిల కాగితం ఇచ్చాను. మీరెళ్లి బస్సులో కూర్చోండి, టిక్కెట్టు తెస్తానని ఐపులేకుండా పోయేడు. అందువల్ల ఏం అనుకోకండి. ఎప్పుడూ మీ టిక్కెట్టు మీరు తీసుకోడమే మంచిది. ప్లీజ్ గో అండ్ స్టాండ్ ఇన్ ది లైన్" అన్నారు మాష్టారు.

— వి.ఎస్.ఆర్. మూర్తి